మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కేసీఆర్‌ను తిట్టడం మాని అభివృద్ధిపై దృష్టిపెట్టు

- నిన్ను గెలిపించిన ప్రజలకు ఏదైనా చేసి చూపించు
- బండి సంజయ్‌కు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సవాల్

కార్పొరేషన్, ఆగస్టు 20: కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఇప్పటికైనా కేసీఆర్‌ను, బీఆర్ఎస్‌ను తిట్టడం మానుకొని రాష్ట్ర, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఆలోచనలు చేయాలని బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ సూచించారు. ఇన్నాళ్లు అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్, బీఆర్ఎస్‌ను తిట్టి బండి సంజయ్ కేంద్ర మంత్రి అయ్యాడని దుయ్యబట్టారు. ఇప్పుడు అధికారంలో లేకపోయినా కూడా బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను చూసి ఇంకా బండి సంజయ్, సీఎం రేవంత్‌రెడ్డి భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మంగళవారం స్థానిక 37వ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బండి సంజయ్‌కు చిత్తశుద్ధి ఉంటే కరీంనగర్ అభివృద్ధికి నిధులు తేవడంతో పాటు, ఆగిపోయిన మానేరు రివర్ ఫ్రంట్, ఎల్ఎండికి నీటి విడుదలపై మాట్లాడాలని సవాల్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలయ్యేంత వరకు ప్రజల తరపున బీఆర్ఎస్ పోరాడుతుందన్నారు. కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవుతుందంటూ బండి సంజయ్.. కాదు బీజేపీలో విలీనమవుతుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి అనడం విడ్డూరంగా ఉందన్నారు. వీళ్లు ఏమైనా బ్రోకరిజం చేస్తున్నారా అని మండిపడ్డారు. విలీనంపై పార్టీ అధినాయకత్వాలు మీకు చెప్పాయా అని ప్రశ్నించారు. బండి సంజయ్‌ని కరీంనగర్ ప్రజలు అభివృద్ధి చేయమని గెలిపించారే తప్ప కేసీఆర్‌ను తిట్టమని కాదన్నారు. ఇటీవల ఇండియాకు వచ్చిన శ్రీలంక మంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఈ ప్రాంత అభివృద్ధిపై కితాబివ్వడం ఇక్కడ జరిగిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేసీఆర్, బీఆర్ఎస్‌ను విమర్శించే అర్హత కాంగ్రెస్, బీజేపీలకు లేదన్నారు. తెలంగాణ ప్రజల తరపున పోరాడే పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. కాంగ్రెస్, బీజేపీకి భయపడే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్‌రెడ్డి, నాయకులు సాయికృష్ణ, ఆరె రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, మెరుగు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

NOTICE

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE (MACT) AT KARIMNAGAR

M.V.O.P. No. 148 of 2021

Between:-
Lanka Harish ...Petitioner/Petitioner.
AND
Machunuri Ram Reddy and others ...Respondents/Respondents

To,
R4] Lingampalli Padma W/o. Late Madan Mohan Reddy age: 69 years, Occ: House hold.
R5] Lingampalli AnilKumar Reddy S/o. Late Madan Mohan Reddy age: 50 years, Occ: Business
R6] Lingampalli Sunil Kumar Reddy S/o. Late Madan Mohan Reddy age: 47 years, Occ: Business
R7] Lingampalli Madhavi D/o. Late Madan Mohan Reddy age: 44 years, Occ: House hold
All are R/o. Aditya Enclave, Flat No. 201 Behind Varalaxmi Garden, Tulasinagar, Vavilalapalli localiy of Karimnagar town and district.

Whereas the above named Petitioner have filed a petition **Under Sec. 166(1) (a) of M.V. Act. 1988** against yours and others praying before the Hon'ble Court for compensation.

Take notice that the above Case is posted on **19-09-2024** for your appearance & counter and in case of your failure to appear in person or through an Advocate on the said date at 10:30 am before the Hon'ble Prl. District Judge Karimnagar the matter will be heard and determined in your absence.

(By the order of the Hon'ble Court)
SD/- **Muddasani Sampath,** Advocate, (TS/1728/2011)
H.No. 2-10-982, Jyothinagar, Karimnagar Town & Dist. Cell: 9985776258.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

పట్టణంలో చోరీ

- పోలీసుల అదుపులో దొంగ..?

జమ్మికుంట, ఆగస్టు 20: మున్సిపల్ పరిధిలోని లోటస్‌పాండ్ పాఠశాల సమీపంలోని ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గుడివాడ పుల్లారావు కుటుంబం ఇమ్మడి అనిల్ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. టిఫిన్ సెంటర్ నిర్వహించుకుంటూ జీవిస్తున్నారు. ఇటీవల పుల్లారావు భార్య మృతి చెందడంతో కొడుకులు సుధాకర్, సునీల్‌తో కలిసి కాశీకి వెళ్లారు. గతంలో ఇదే ఇంట్లో కొన్ని నెలల క్రితం కూడా చోరీ జరిగింది. దీన్ని దృష్టిలో పెట్టుకున్న కుటుంబం ఇంట్లో నగదు, నగలు నిల్వ చేయలేదు. అయితే.. అనుకున్నట్లే మళ్లీ అదే ఇంట్లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చారు. కాశీకి వెళ్లిన కుటుంబ యజమానితో మాట్లాడారు. రూ.3వేల నగదు, ఓ సెల్‌ఫోన్ పోయిందని గుర్తించారు. కాగా, చోరీపై బాధిత కుటుంబ సమీప బంధువు మునగాల అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, చోరీ జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు దొంగను పట్టుకున్నట్లు తెలిసింది. సదరు దొంగ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

జీవో నం.29 రద్దు చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 20 : రాష్ట్రంలో గ్రూప్ 1 మెయిన్స్‌కు హాజరయ్యే అభ్యర్థులకు తీరని నష్టం చేస్తున్న జీవోనం.29ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ నిరుద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.ఓంప్రకాశ్ డిమాండ్ చేశారు. గ్రూప్ 1లో ఓపెన్ కేటగిరీ పోస్టులకు1:50 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల జాబితాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగుల కోటాకు చెందిన వారి జాబితాను ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. అలాగే, జీవోనం.46 అభ్యర్థులకు కూడా న్యాయం చేయాల్సిన అవసరముందని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

భారీ వర్షానికి కూలిన ఇల్లు

గంగాధర, ఆగస్టు 20 : ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వెంకటాయపల్లి గ్రామానికి చెందిన కల్లెపెల్లి మల్లయ్యకు చెందిన ఇల్లు పైకప్పు సోమవారం కూలి పోయింది. ఇంటి వెనుక భాగం పైకప్పు కూలి పోవడంతో ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని మల్లయ్య కోరారు.

'గద్దపాక నుంచి మమ్మల్ని వేరు చేయొద్దు'

శంకరపట్నం, ఆగస్టు 20 : గద్దపాక గ్రామం నుంచి అంబేద్కర్ నగర్ గ్రామం పేరుతో ప్రత్యేక పంచాయతీగా తమను వేరు చేయవద్దని గద్దపాక ఎస్సీ కాలనీకి చెందిన పలువురు మంగళవారం ఎంపీడీవో కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రత్యేక జీపీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనుకకు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ వైస్ ఎంపీపీ రమేశ్, నాయకులు కనుకుట్ల సాగర్, శనిగరం అంజి, సోమిడి మల్లయ్య, రాచర్ల అంజయ్య, సోమిడి కొమురయ్య, పులికోట అనిల్ ఉన్నారు.

తాడికల్‌లో ఫీవర్ సర్వే

శంకరపట్నం, ఆగస్టు 20 : తాడికల్ గ్రామంలో మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే చేసి జ్వర కేసులను నమోదు చేసుకున్నారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి ఆశ కార్యకర్తలకు డ్రై డేపై అవగాహన కల్పించారు. ఫీవర్ సర్వేను హుజూరాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ చందు పరిశీలించారు. సర్వే తీరుపై ఆరా తీశారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇక్కడ వైద్యాధికారి డాక్టర్ గొట్టె శ్రావణ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలి

- జిల్లా వ్యాప్తంగా రైతువేదికల ఎదుట బీజేపీ నాయకుల నిరసన
- వీణవంక, శంకరపట్నంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

వీణవంకలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

తిమ్మాపూర్/ మానకొండూర్/వీణవంక/చిగురుమామిడి/ జమ్మికుంట/ ఇల్లందకుంట/ రామడుగు/ శంకరపట్నం/ గంగాధర, ఆగస్టు 20: రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే చెల్లించాలని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వివిధ మండలాల్లో ఆందోళన, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా మానకొండూర్ రైతు వేదిక ఎదుట నిరసన చేపట్టి, మండల వ్యవసాయాధికారికి వినతి పత్రం అందచేశారు. వీణవంకలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద రైతులతో కలిసి ధర్నా చేశారు. ఇల్లందకుంట, తిమ్మాపూర్, రామడుగు, గంగాధర మండల కేంద్రాల్లో ఏవో, తహసీల్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి అధికారులకు వినతి పత్రం అందజేశారు. జమ్మికుంట పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శంకరపట్నం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

చిగురుమామిడిలో ఉద్రిక్తత

చిగురుమామిడి, ఆగస్టు 20: రుణమాఫీ కోసం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం రైతులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ శ్రేణులు సర్కారుకు అనుకూలంగా పోటాపోటీగా నినాదాలు చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలంటూ బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టగా, రైతులు అక్కడికి చేరుకొని మద్దతు తెలిపారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు రైతులకు పోటాపోటీగా ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశంతో ఆందోళన సద్దుమణిగింది.

రుణమాఫీకి దరఖాస్తుల వెల్లువ

శంకరపట్నం/ చిగురుమామిడి/ గంగాధర, ఆగస్టు 20 : రుణమాఫీ కానీ రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చేసిన సూచనతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా వివిధ రైతు వేదికలకు రైతులు భారీగా తరలివచ్చారు. శంకరపట్నం, చిగురుమామిడి, గంగాధర రైతు వేదికల్లో వ్యవసాయ అధికారులు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగా, మొదటి రోజు వివిధ గ్రామాలకు చెందిన 250 మంది రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు గంగాధర మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చివరి రైతు వరకు కొనసాగుతుందని శంకరపట్నం ఏవో వెంకటేశ్ తెలిపారు. కాగా, స్టేట్‌మెంట్ల కోసం శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంక్‌తో పాటు కేశవపట్నం యూనియన్ బ్యాంక్, పీఏసీఎస్‌ల వద్ద రైతులు బారులు తీరారు.

ఆపద వస్తే అండగా ఉంటా: ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 20: నియోజకవర్గంలోని పేదలకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి భరోసా ఇచ్చారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో లబ్ధిదారుల ఇండ్లకు సతీసమేతంగా వెళ్లి రూ.14లక్షల విలువ చేసే 59 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించారు. ఎమ్మెల్యేనే స్వయంగా ఇంటికొచ్చి చెక్కులు అందించడంతో కొందరు భావోద్వేగానికి గురయ్యారు. పండుగపూట ఎమ్మెల్యే ఇంటికి రావడంతో మహిళలు రాఖీ కట్టి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు ప్రతాప తిరుమల్ రెడ్డి, ముత్యంరాజు, తాళ్లపెల్లి శ్రీనివాస్ గౌడ్, కేసిరెడ్డి లావణ్యా నరసింహారెడ్డి, మొలుగు పూర్ణచందర్, రమాదేవి, ఇమ్రాన్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదు: కూనంనేని

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 20: రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ జరుగకుంటే పోరాటం తప్పదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని మధువని గార్డెన్‌లో జరిగిన సీపీఐ నిర్మాణ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తదుపరి కార్యాచరణపై పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన బహిరంగసభలో, విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ మతాన్ని అడ్డుపెట్టుకొని కొంతకాలం రాజకీయం చేసిందని, ఇప్పుడు హిందూ మతాన్ని హైజాక్ చేయాలని చూస్తున్నదని విమర్శించారు. భవిష్యత్‌లో తెలంగాణలో బీజేపీని నిలువరిస్తామన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ విషయంలో రైతాంగానికి పూర్తిస్థాయిలో న్యాయం చేయలేదన్నారు. వెంటనే అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, నాయకులు మంద పవన్, సదానందం, సృజన్ కుమార్, అశోక్, సురేందర్ రెడ్డి, లక్ష్మి, చాంద్ పాషా, రాజు, రాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ 98 క్వాలిఫైడ్ టీచర్లకు ఉద్యోగాలు ఇప్పించండి

అధికారుల అలక్ష్యం వల్ల నష్టపోయిన డీఎస్సీ 1998 బ్యాచ్ క్వాలిఫైడ్ టీచర్లకు తిరిగి ఉద్యోగాలు ఇప్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆ సంఘం నాయకులు మంగళవారం పట్టణంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి మార్గదర్శకులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 20 : జిల్లా కేంద్రంలోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ టైనీటాట్స్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ టీచర్స్ రీ-క్వెస్ట్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ లయన్ డాక్టర్ వీ నరేందర్ రెడ్డి, కార్యక్రమ సమన్వయకర్త లయన్ కెప్టెన్ బీ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి మార్గదర్శకులని, ఉత్తమ భవిష్యత్తుకు పునాదులు వేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఇక్కడ ప్రముఖ విద్యావేత్త సింగమ రాజు, కోశాధికారి సురేందర్, పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

పారమిత హెరిటేజ్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్'

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 20 : జిల్లా కేంద్రంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో ప్రత్యేక హరితహారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు ప్రారంభించి, తన తల్లి పేరిట మొదటి మొక్కను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. ఇక్కడ డైరెక్టర్లు ప్రసూన, రష్మిత, అనూకర్ రావు, రాకేశ్, వీయూఎం ప్రసాద్, రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు అప్పగింత

శంకరపట్నం, ఆగస్టు 20: ఇద్దరు వ్యక్తులు ఇటీవల పోగొట్టుకున్న రెండు మొబైల్ ఫోన్లను వెతికి తిరిగి వారికి అప్పగించినట్లు ఎస్ఐ కొత్తపల్లి రవి తెలిపారు. కొత్తగట్టు గ్రామానికి చెందిన నూనె వెంకటేశ్ 10 రోజుల క్రితం రూ.13,500 విలువైన ఫోన్‌ను, ముత్తారం గ్రామానికి చెందిన నూనె మహేందర్ 3 నెలల క్రితం రూ.16,500 విలువైన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు సీఈఐఆర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. టెక్నాలజీ సాయంతో ఈ రెండు ఫోన్లను కనుక్కొని తిరిగి మంగళవారం వారికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

డాక్టర్ ముత్యంకు ఘన నివాళి



ఎస్‌యూలో డాక్టర్ ముత్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్, తదితరులు

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 20 : శాతవాహన విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ పూర్వ అధ్యాపకుడు కవి, సాహితీ వేత్త డాక్టర్ కే ముత్యం మంగళవారం తెల్లవారు జామున అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందగా, జిల్లాకు చెందిన పలువురు కవులు, సాహితీ వేత్తలు, అధ్యాపకులు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా శాతవాహన యూనివర్సిటీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాఫర్, అధ్యాపకులు డాక్టర్ హుమేరా, డాక్టర్ పద్మావతి, డాక్టర్ శ్రీవాని, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ మూన్వర్, డాక్టర్ అబ్రార్, డి. విజయ్ ప్రకాశ్, డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ కృష్ణ కుమార్, డాక్టర్ రాజు, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ పావని, కళాశాల సిబ్బంది చంద్రశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు సి. కుమార్, ప్రధాన కార్యదర్శి దామరకుంట శంకరయ్య, విలాసాగరం రవీందర్, పెనుగొండ బాసవేశ్వర్, సరసిజ, ఉపాధ్యాయుడు కూకుట్ల తిరుపతి తదితరులు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానం

కలెక్టరేట్, ఆగస్టు 20: 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని దివ్యాంగ విద్యార్థుల నుంచి ఉపకార వేతనాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం సరస్వతి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకు చదువుతున్న దివ్యాంగులు www.scholarships.gov.in, www.depwd.gov.in వెబ్‌సైట్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెన్యువల్‌తో పాటు కొత్తగా అర్హులైన వారు కూడా నిర్దేశించిన గడువులోగా ఆన్‌లైన్‌లో పంపాలని స్పష్టం చేశారు. ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 31, పోస్ట్-మెట్రిక్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ స్కాలర్‌షిప్‌ల కోసం 31 అక్టోబర్ 2024 లోగా దరఖాస్తులు పంపాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు..

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 20 : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు కోసం ఈనెల 24లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్ స్కూల్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తులను 24న ఉదయం 11.30 గంటల్లోగా తమ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

మార్కెట్ కమిటీల నూతన పాలకవర్గాలతో ఎమ్మెల్యే కవ్వంపల్లి

తిమ్మాపూర్/మానకొండూర్, ఆగస్టు 20: నియోజకవర్గంలోని మానకొండూర్, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాల మార్కెట్ కమిటీ పాలకవర్గాలను ప్రభుత్వం ఎంపిక చేయగా.. ఆయా కమిటీలకు ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియామక పత్రాలను అందజేశారు. మానకొండూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా లలితాపూర్ మాజీ సర్పంచ్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్‌గా రామిడి తిరుమల్ రెడ్డి, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పులి కృష్ణ, వైస్ చైర్మన్‌గా చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, ఇల్లంతకుంట ఏఎంసీ చైర్మన్‌గా ఐరెడ్డి చైతన్య, వైస్ చైర్మన్‌గా ఎనగందుల ప్రసాద్, అన్ని కమిటీలకు డైరెక్టర్లను ప్రభుత్వం ఎంపిక చేయగా నియామక పత్రాలను అందజేసి అభినందించారు. రైతులకు మెరుగైన సేవలందించాలన్నారు. పార్టీ కోసం ఇన్నాళ్లుగా కష్టపడ్డవారికే పదవులు ఇస్తానని, వలసలు వచ్చిన వారికి ఇవ్వనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 20: ఎస్సీ ఉపకులాల వర్గీకరణకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహిస్తున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి నిషాని రామచంద్రం, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి మహేశ్ పిలుపునిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం వారు మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా బంద్‌లో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్, మహేందర్, శంకర్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలపై స్పష్టత ఇవ్వకపోతే ఆందోళన తప్పదు

రామడుగు, ఆగస్టు 20 : గోపాల్‌రావుపేటలో అన్ని కుల సంఘాల ఆధ్వర్యంలో హనుమాన్, ఊర పోచమ్మ, నల్ల పోచమ్మ ఆలయాల నిర్మాణాన్ని చేపట్టగా, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న, ఆమె భర్త కర్ర వెంకట్రామిరెడ్డి రాజకీయ నాయకుల అండదండలతో అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయాల పునర్నిర్మాణం చేపట్టినందుకు గ్రామానికి చెందిన కొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేసి తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాల నిర్మాణాలపై అధికారులు వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వకపోతే గ్రామ ప్రజలందరం కలిసి భారీ ఎత్తున ఆందోళన చేపడుతామని ఆలయాల పునర్నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు నేరెళ్ల అంజయ్యగౌడ్, ఎడవెల్లి నరేందర్‌రెడ్డి, పాపిరెడ్డి, కల్లెం అంజయ్య, ఏగోలపు మల్లేశం, దొనపాటి సీతారాంరెడ్డి, రేండ్ల మల్లేశం, కొలిపాక మల్లయ్య, కచ్చు లింగయ్య, పైండ్ల శ్రీనివాస్, కాసారపు పరశురాంగౌడ్, బుర్ర శ్రీకాంత్‌గౌడ్, ఏగోలపు కొమురయ్య హెచ్చరించారు.

'మహిళలపై అఘాయిత్యాలకు ప్రభుత్వాలదే బాధ్యత'

తెలంగాణచౌక్, ఆగస్టు 20: దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని అఖిల భారత యాదవ మహాసభ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సందవేణి గీతాంజలి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. మహిళల చైతన్యం కోసం తమ సంఘం తరపున సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

23 నుంచి ఆటో సంఘర్షణ యాత్ర

తెలంగాణచౌక్, ఆగస్టు 20: రవాణా రంగ కార్మికుల సమస్యలపై సెప్టెంబర్ 23, 24 తేదీల్లో చేపడుతున్న ఆటో సంఘర్షణ యాత్రను విజయవంతం చేయాలని పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రవి కోరారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటో సంఘర్షణ యాత్ర 23న వీణవంక మండల కేంద్రం నుంచి ప్రారంభమవుతుందని, 24న కరీంనగర్‌లో ముగుస్తుందని తెలిపారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి యాత్ర చేపట్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మల్లయ్య, మహేందర్ పాల్గొన్నారు.

వంతెనపై ఒరిగిన ట్రక్కు.. నిలిచిన ఆర్టీసీ బస్సుల రాకపోకలు

రామడుగు, ఆగస్టు 20 : రామడుగు పాతవంతెనపై భారీ వాహనం ఒక వైపు ఒరగడంతో ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరిన పాత వంతెన ఏడాది క్రితం కురిసిన భారీ వర్షాలతో పైనుంచి వచ్చిన వరదల కారణంగా వంతెన కొంతమేర కొట్టుకుపోగా, మట్టిని పోసి పలుమార్లు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కరీంనగర్ నుంచి వచ్చిన భారీ వాహనం రామడుగు వంతెనపై మట్టిలో కూరుకుపోయి వాగులోకి ఒరిగిపోయింది. దీంతో ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, పాఠశాలల వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పారదర్శక ఓటరు జాబితాకు పార్టీలు సహకరించాలి: కలెక్టర్

కలెక్టరేట్, ఆగస్టు 20: జిల్లాలో 2025 ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ పమేలా సత్పతి కోరారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం పలు పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా కీలకమని, బీఎల్‌వోలు, బీఎల్ఏల సహకారంతో తప్పులు లేని జాబితా రూపొందించాలన్నారు. బీఎల్‌వోలు యాప్ ద్వారా ఓటరు నమోదు చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్ ఓటర్లు, చనిపోయిన వారిని గుర్తించి, వారి కుటుంబ సభ్యులను సంప్రదించి పేర్లు తొలగించాలన్నారు. బీఎల్‌వోలు తమ వద్ద ఫారమ్ 6,7,8 అందుబాటులో ఉంచుకోవాలన్నారు. జనవరి 1, 2025ను ప్రామాణికంగా తీసుకుని ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబితాలో ఉన్న లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తిస్థాయిలో సవరిస్తున్నట్లు వెల్లడించారు. జాబితాల్లో ఉండే మల్టీ ఎంట్రీలు గుర్తించి, తొలగించాలని, ఓటరు కార్డుపై ఉండే పొరపాట్లు పరిష్కరించేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో పవన్‌కుమార్, ఆర్‌డీవో కుందారపు మహేశ్వర్, ఐఎన్‌సీ మోహనాచారి, రాజకీయ పార్టీల ప్రతినిధులు నాంపల్లి శ్రీనివాస్, కె.రాజేందర్, ఎస్.శ్రీనివాస్, సయ్యద్ బర్కత్ అలీ, కె.ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తుల స్క్రూట్నీ పూర్తి చేయాలి

కలెక్టరేట్, ఆగస్టు 20 : జిల్లాలో ధరణి పెండింగ్ దరఖాస్తుల స్క్రూట్నీ పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ, ధరణిలో నమోదుకు తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలు తెలియజెప్పాలని సూచించారు. భూసమస్యల పరిష్కారానికి తెస్తున్న నూతన ఆర్‌వోఆర్ చట్టంపై ఈనెల 23, 24 తేదీల్లో వర్క్‌షాప్ నిర్వహించాలని, బిల్లులో చేయాల్సిన మార్పులపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి లిఖిత పూర్వకంగా అందజేయాలన్నారు. రాబోయే ఐదు రోజుల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న దృష్ట్యా, అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్ర పరిశీలన మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా ప్రభుత్వ భూమికి నష్టం కలగొద్దని, నీటి వనరులు, కాలువలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు తేల్చి చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్‌తో పాటు పలు శాఖల అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితతో మాజీ మంత్రి కొప్పుల ములాఖత్

కార్పొరేషన్, ఆగస్టు 20: న్యూఢిల్లీ తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్.రమణ మంగళవారం ములాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

నగరపాలక సంస్థ నూతన కమిషనర్ చాహత్ భాజ్‌పాయ్

చాహత్ భాజ్‌పాయ్

కార్పొరేషన్, ఆగస్టు 20: కరీంనగర్ నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా 2019 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ చాహత్ భాజ్‌పాయ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆమెను కరీంనగర్‌కు బదిలీ చేశారు. ప్రస్తుతం కమిషనర్‌గా ఉన్న శ్రీనివాస్ నెల రోజులుగా సెలవుల్లోనే ఉండడంతో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు గడువు పొడిగింపు

మానకొండూర్, ఆగస్టు 20: 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 31 వరకు గడువు పొడిగిస్తూ టీజీబీఐఈ (తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్) కార్యదర్శి ఉత్తర్వులు జారీచేసినట్లు మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే రాజేశ్వర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశాలు పొందే ఆసక్తిగల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు కేంద్ర సహాయ మంత్రి అభినందన

రామడుగు, ఆగస్టు 20 : పేద కుటుంబంలో జన్మించినా, అలుపెరుగని కృషితో ఐఏఎస్ సాధించి జిల్లా ఖ్యాతిని పెంచావంటూ కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ వెలిచాలకు చెందిన నందాల సాయికిరణ్‌ను అభినందించారు. రామడుగు మండలం వెలిచాలకు చెందిన సాయికిరణ్ మంగళవారం జిల్లా కేంద్రంలో కేంద్ర సహాయమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర సహాయమంత్రి సంజయ్‌కుమార్ సాయికిరణ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఇక్కడ బీజేపీ జిల్లా కార్యదర్శి ఉప్పు రాంకిషన్, రామడుగు మండల ఉపాధ్యక్షుడు కాడె నర్సింగం, రుద్ర నితీశ్, చైతన్య, రాంచందర్‌రావు, మల్లేశం తదితరులు ఉన్నారు.

సెలవుల్లో కార్యదర్శి.. ఇబ్బందుల్లో ప్రజలు

హుజూరాబాద్, ఆగస్టు 20: మండలంలోని రాంపూర్ గ్రామ కార్యదర్శి సొంత పనిమీద మూడు నెలలు లీవ్ పెట్టగా, అధికారులు ఇన్‌చార్జి కార్యదర్శిగా నియమించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రత్యేకాధికారి సైతం ఇటీవలే బదిలీపై వెళ్లడంతో పంచాయతీ పాలనా వ్యవహారాలు చూసే వారు కరువయ్యారు. అవసరమైన సర్టిఫికెట్ల కోసం ఇబ్బందులు పడాల్సివస్తున్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి ఇన్‌చార్జి కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

తెలుగు రచయితల మహాసభలకు 'వైరాగ్యం'తకు ఆహ్వానం

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 20: చిత్తూరులోని తిరుమల తిరుపతి దేవస్థానం కల్యాణ మండపంలో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య, ఎంవీ కేశవరెడ్డి స్మారక ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు రచయితల మహాసభలకు అభిమాన అతిథిగా కరీంనగర్‌కు చెందిన కవి రచయిత, విమర్శకుడు వైరాగ్యం ప్రభాకర్‌కు ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆహ్వాన సంఘ అధ్యక్షుడు ఎంవీ శ్రీధర్ రెడ్డి, జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీ నారాయణస్వామి తనకు ఆహ్వాన పత్రికను పంపించారని వైరాగ్యం ప్రభాకర్ తెలిపారు.

జిల్లా యువజన, క్రీడాశాఖాధికారిగా ఎం శ్రీనివాస్

కొత్తపల్లి, ఆగస్టు 20: జిల్లా యువజన క్రీడాశాఖాధికారిగా వి. శ్రీనివాస్ బదిలీపై కరీంనగర్‌కు రానున్నారు. ప్రస్తుతం ఆయన సంగారెడ్డి డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీలో స్విమ్మింగ్ కోచ్‌గా పని చేస్తున్నారు. ఇక్కడ డీవైఎస్‌వోగా పనిచేస్తున్న బి. శ్రీకాంత్‌రెడ్డిని నిర్మల్ జిల్లా డీవైఎస్‌వోగా బదిలీ చేస్తూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) ఎండీ ఉత్తర్వులు జారీ చేశారు.

రాష్ట్ర చాంపియన్‌షిప్ సాధించిన జిల్లా క్రీడాకారులు

కొత్తపల్లి, ఆగస్టు 20 : రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు అద్భుత ప్రతిభ చూపి రాష్ట్ర చాంపియన్‌షిప్‌ను సాధించాయి. ఈనెల 17,18 వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరిగిన 10వ తెలంగాణ అండర్-23 పురుషుల, మహిళల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్న జిల్లా జట్లకు చెందిన క్రీడాకారులు అధిక పతకాలు సాధించి రాష్ట్ర చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. గెలుపొందిన క్రీడాకారులను, వారికి శిక్షణనిచ్చిన కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎన్ మహిపాల్, కె రవి, అసోసియేషన్ బాధ్యులు రాజగోపాలాచారి, కటకం రవి, హరికిషన్, సుమన్ కళ్యాణ్, రమేశ్, బీషన్ సింగ్ తదితరులు అభినందించారు.

జర్నలిస్టు వైద్య చికిత్సకు దాతల విరాళం

కొత్తపల్లి, ఆగస్టు 20 : విష జ్వరంతో బాధపడుతూ ప్రాణాపాయ స్థితిలో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో వైద్య చికిత్స పొందుతున్న ఓ దినపత్రికకు చెందిన జర్నలిస్టు సిలివేరి మహేందర్ చికిత్స కోసం దాతలు విశేషంగా స్పందిస్తున్నారు. నగరంలోని డాన్ బాస్కో స్కూల్ కరస్పాండెంట్ ఎస్ మురళీ మనోహరాచారి రూ.50వేలను చికిత్స కోసం అందించారు. అలాగే రోలర్ స్కేటింగ్‌కు చెందిన సీనియర్ కోచ్ గట్టు అనిల్ రూ 10వేలు, కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేట్ అధ్యాపకులు, తదితరులు ఆర్థిక సాయం అందిస్తున్నారు. విష జ్వరంతో బాధపడుతున్న మహేందర్ వైద్య చికిత్స కోసం ప్రతి రోజు ఆరు ఇంజెక్షన్‌లు వేయాల్సి ఉండగా, వాటికే రూ.1.20 లక్షలు, ఇతర పరీక్షలు, చికిత్సల కోసం మరో రూ.లక్ష వరకు ఖర్చు అవుతున్నది. కుటుంబం పేదరికంలో ఉండడంతో దాతలు అందిస్తున్న విరాళాలతో వైద్య చికిత్సలు కొనసాగుతున్నాయి. ఆర్థిక సాయం అందించేవారు 8688117162కు ఫోన్ పే, గూగుల్ పే చేయాలని కుటుంబ సభ్యులు వేడుకుంటున్నారు. విరాళాలు అందించిన దాతలకు మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ప్రతినిధులు తుమ్మల రమేశ్‌రెడ్డి, ఎన్ సిద్ధారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

రాంనగర్/ సైదాపూర్/హుజూరాబాద్ టౌన్/ వీణవంక/శంకరపట్నం/ గంగాధర/ చిగురుమామిడి, ఆగస్టు 20: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతిని జిల్లాలోని సైదాపూర్, హుజూరాబాద్, వీణవంక, శంకరపట్నం, చిగురుమామిడి మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మానకొండూర్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరై రాజీవ్ గాంధీ చిత్రపటంపై పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ, నగరంలో రాజీవ్ గాంధీ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.